


**ఈ రోజుకు మా తాతగారు ఆఖరి శ్వాసను విడిచి శూన్యంలో కల్సిపోయి మాకు దూరమై నలభై ఎనిమిది గంటలు దాటిన మూడోరోజు మాత్రమే! అందుకే వారి వియోగ దుఃఖపు ఛాయలు ఇంకా గాఢంగానే మా ఇంటిని అంటిపెట్టుకొని వున్నాయి. ఇంకా వారు సజీవంగానే వున్నట్లు, మా మధ్య తిరుగుతున్నట్లు భావన... భ్రాంతి!**

గుబురు మీసాలతో అక్కడక్కడా నెరిసిన జుత్తుతో నవ్వుతూ నవ్విస్తూ ఎప్పుడూ కుడిచేతి రెండువేళ్ల మధ్య కాల్తున్న సిగరెట్టుతో ఆ సిగరెట్టు పొగల మధ్య మా తాతగారు! వారిని నేనే కాదు వారితో ఓ గంట మాట్లాడిన మరెవ్వరూ ఇట్టే మర్చిపోరు. అటువంటి తాతగారి శవాన్ని నిన్న దహనం చేస్తుంటే కాలుతున్న చితిని చూసినప్పుడు తాతగారు దర్జాగా పడుకుని సిగరెట్టు కాలుస్తున్నట్ల నిపించింది నా కళ్లకు. మరి తాతగారికీ

స్మోకింగుకీ మధ్యనున్న సంబంధం అంత అవినాభావ మైనది!

చివరకు చనిపోవడానికి ముందు మృత్యువు తనని కబళించిందన్న విషయం తెల్సుకుని మా నాన్నగార్ని దగ్గరకు పిలిచి ఆయన కోరిన చివరి కోరికల్లో అదొకటి - "అందరికీ అన్నదానం చేద్దురు గాని అది తర్వాత సంగతి, ముఖ్యంగా సిగరెట్లు పంచి పెట్టండి. శవయాత్రలో చిల్లరతో పాటే సిగరెట్లూ దండిగా చల్లండి!"

అలా కోరిన తర్వాత నాన్నగార్ని మరీ దగ్గరకు తీసుకుని చెవిలో ఏదో గుసగుస చేశారు. ఏం చెప్పారో నాకు తెలీదు. ఇప్పటికీ ఎంత ఆలోచించినా నాకు తోచడం లేదు ఏం చెప్పుంటారోనని!

నిజానికి మా తాతగారికి పెద్ద వయస్సేమీ లేదు. వచ్చే సంవత్సరం ఎంతో ఘనంగా షష్టి పూర్తి చేయాలని నాన్నగారు ఎన్నో సందర్భాలలో ఎంతో మందితో అనడం నేనెరుగుదును.

అందుకే నాన్నమ్మను చూస్తుంటే గుండె తరుక్కు పోతోంది. పచ్చి మంచినీళ్లు కూడా తాగకుండా ఓ మూలన పడుకుని మూగగా రోదిస్తోన్న నాన్నమ్మను చూస్తుంటే తాతయ్య సిగరెట్ కాల్చి పారేశాక మిగిలిన యాష్‌లా వుంది!


రోజూ నేను, తాతగారు, నాన్నమ్మ కలసి ఓంకార క్షేత్రం దాకా వెళ్లొచ్చే వాళ్లం. అప్పుడు దార్లో తాతగారు ఎన్నెన్ని కబుర్లు చెప్పేవారో! వారి ఉపన్యాసానికి నేనూ, నాన్నమ్మ కేవలం శ్రోతల్లా వుండాల్సొచ్చేది. మరి మాట్లాడటానికి మాకు ఏమాత్రం అవకాశం ఇచ్చేవారు కాదు కదా! అందుకే వారిని అప్పుడప్పుడూ 'రేడియో తాతగారూ' అని పిలుస్తుండేవాడ్ని. కానీ తరచుగా పిలిచే పేరు మాత్రం 'సిగరెట్టు తాతగారూ' అనే!

ఓసారి సాయంకాలం ఇలానే అడిగాను 'తాతగారూ! మీకీ స్మోకింగ్ ఎలా అలవాటైందీ' అంటూ. అప్పుడు మొదలెట్టారు తాతగారు తన స్మోకింగ్ కత.

"చూద్రా అబ్బాయ్! నా స్మోకింగ్ కత చెప్పాలంటే ఇప్పుడు మనం సరిగ్గా ఏభై ఏళ్లు వెనక్కి వెళ్లాలోయ్. అంటే స్వాతంత్ర్యం రాక పూర్వపు సంగతన్న మాట. అప్పుడు నేను ఫస్ట్ ఫారమ్ చదువుతున్నాను. సాయంత్రం పూట పిల్లలందరం కలసి ఒకరి వీపు మరొకరు పట్టుకొని పరిగెడుతూ 'ఎంతెంతదూరం' లాంటి ఆటలు ఆడటం ఆపేసి రైలాట ఆడటం మొదలుపెట్టినప్పటి సంగతన్నమాట.

"కోకొకొక్ ... ఛక్...ఛక్.. మంటూ బడి అయిపోగానే అందరం ఒకరి చొక్కా మరొకరు వీపు భాగాన పట్టుకుని పరుగెడుతూ ఆడుకుంటూ వచ్చి ఎవరిళ్లు రాగానే వాళ్లు తొలగిపోయేవాళ్లం.

అందరికన్నా చివరున్న ఇల్లు వాడే ఇంజను అనే సరికి ఆ ఇంజను అవతారం నేనే ఎత్తాల్సి వచ్చింది. ఇలా




ఆడుతూ ఆడుతూ ఓ రోజు సెలవు దినాన మా ఇళ్ల దగ్గరున్న పార్కులో రైలాట ఆడుతుంటే ఓ కంపార్టు మెంటుకి అనుమాన మొచ్చింది. "రైలు ఇంజను లోంచి పొగ రావాలి కదా మరి ఏదీ పొగ?" అంటూ.

"అప్పుడు తతిమ్మా కంపార్టుమెంట్లన్నీ కలసి ఆలోచించి చివరకు ఓ చిన్న అగరొత్తు పుల్లని కాల్చి నా నోట్లో పెట్టుకుని రైలు పోనివ్వాలంటూ తేల్చారు. ఆ అయిడియా నచ్చకపోయినా 'ఎంతైనా ఇంజనుగాడ్ని గాదా' అని సరిపుచ్చుకుని అలాగే రైలాట ఆడసాగాను. కానీ దీనికన్నా గొప్ప ఐడియా ఆలోచించాలన్న ఆలోచనతో అలా తీవ్రంగా ఆలోచిస్తూనే వున్నాను.

"అలా ఆలోచిస్తున్నప్పుడు ఓ రోజు పార్కులో ఓ వ్యక్తి నోట్లో సిగరెట్లు పెట్టుకుని తాగుతూ నడుచుకుంటూ వెళ్లడం నా కళ్లలో పడింది. అతని నోట్లోంచి గుప్పు గుప్పుమని వస్తున్న పొగ రైలింజను గొట్టంలోంచి విడుదలవుతున్న పొగను గుర్తుచేసింది. వెంటనే 'ఐడియా' అంటూ పెద్దగా అరిచాను.

"అంతే! తర్వాత రోజు పోపు డబ్బాలో అమ్మ దాచిపెట్టే చిల్లర డబ్బులు తీసుకుని సిగరెట్టు కొని రైలింజను స్టార్ట్ చేశాను."


"తెలియక మొదటిసారి పొగ కాస్త లోపలకు పీల్చే సరికి మత్తుగా అనిపించి బైర్లు కమ్మి కళ్లు తిరిగి ఇంజను కింద పడి పోయింది. దాంతో అన్ని కంపార్టుమెంట్లూ నా చుట్టూ చేరి లబోదిబో మన్నాయి. వెంటనే నన్ను ఇంటికి మోసుకెళ్లి ఏం చెప్పాలా అని సతమత మవుతుంటే అమ్మ వెంటనే 'దృష్టి దోషమై వుంటుంది' అంటూ ఎర్ర నీళ్ల దిష్టి తీసేసింది.

"తర్వాత రోజు మరలా ఇంకో సిగరెట్టు తీసుకుని వెలగించబోతుంటే మిత్రులంతా వద్దని భయపెట్టినా కావాలనే వెలిగించి తిరిగి కావాలనే పొగను లోపలకు పీల్చాను. మొదటి సారంత ఘాటుగా అనిపించకపోయినా ఇంజన్ని పడిపోకుండా కాపాడుకున్నాను.

"మొత్తానికి విజయవంతంగా సిగరెట్టు తాగగలిగాం. పొగ వదిలే రైలాట ఆడ గలిగాం. అలా మొదలయిన సిగరెట్టుతో రైలాట ఎంతో ఉత్సాహం కలుగ జేసింది. రోజు రోజుకూ ఇంకొంచెం ఎక్కువ సేపు ఆడితే బావుండు అనిపించేది.

"పొగొదిలే రైలాటకు మా అమ్మ పోపు డబ్బాలోని డబ్బూ, తాతయ్య దిండు కింద చిల్లర రైల్వే బడ్జెట్‌లా ఉపయోగ పడేది. అమ్మేమో చుట్టలకోసం ఆ ముసలాయన తీసుకుంటాడనీ, ఆ ముసలాయనేమో కూరగాయల కోసం దిండుకింద చిల్లర కోడలు పిల్ల తీసుకునుంటుందనీ, సరిపుచ్చుకునేవారు. ఇలా అందుబాటులో వున్న డబ్బు రైలు ఇంజను మేతకు ఉపయోగపడటమే కాక బాగా ప్రోత్సహించేది కూడా!

"ఇక వేసవి సెలవుల్లో అయితే ప్రొద్దున్నపూట కూడా




## జోకు

రైలు ప్రయాణంలో తన ప్రక్కనే కూర్చున్న ఒక ఫ్యాషన్ యువకుడు ఒక కాలికే చెప్ప వేసుకొని ఉండటం చూశాడు అనంత శయనం.

'బాబూ! మీ కాలి చెప్పొకొటి పోయినట్టుంది' చెప్పాడు.

'అబ్బే లేదు. నాకు ఒక కాలి చెప్ప దొరికింది' చెప్పాడా యువకుడు.

**ఆర్.డి.యన్. ప్రకాష్** (భాగ్యనగరం)




ఆడేవాళ్లం. దాంతో సెలవలయిపోయి బడి ప్రారంభమైనాక చూడాలి నా అవస్థ. ఉదయం పదిగంటలయ్యేసరికి ఆట ఆడాలని తపన. కుతి మొదలయ్యేది. 'కంపార్టుమెంట్లన్నీ వుంటేనే నా రైలాట.' అని ఆలోచించి లేచి నిల్చొని 'సార్' అంటూ రెండు వేళ్లు చూపించేవాడ్ని. రెండు వేళ్లు అంటే సిగరెట్టు పట్టుకుని తాగడానికి చిహ్నంలా కాదు. లఘు శంక తీర్చుకోవాలంటూ చెప్పి పర్మిషన్ తీసుకుని టాయిలెట్ లో దూరి ఒక్కణ్ణే రైలాట ఆడేవాడ్ని.

"జేబులో పెట్టుకుంటే కష్టమని అగ్గిపెట్టె సిగరెట్టు ప్యాకెట్ టాయిలెట్‌లో వున్న చూరులో ఎరేంజ్ చేసుకునేవాడ్ని ముందే. కానీ ఇది ఎవరో కనిపెట్టేసుండాలి అక్కడ పెట్టిన సిగరెట్టు ప్యాకెట్, అగ్గిపెట్టె ఇట్టే మాయమవుతుండేవి. ఇక అప్పుడు పిచ్చెక్కి పొయ్యేది. వెధవ సిగరెట్టు ప్యాకెట్‌కు రక్షణ లేదు ఈ స్కూల్లో' అనుకుని జామెట్రీ బాక్సులో పెట్టుకుని వెళ్లేవాడ్ని. సరిగ్గా పదిగంట కొట్టగానే జామెట్రీ బాక్సుతో సహాలేచి నిల్చొని 'సార్' అంటూ రెండేళ్లు చూపించేవాడ్ని.

"రోజూ ఇదే టయానికి వీడెందుకు బయట కెళ్లొస్తున్నాడూ అన్న అనుమాన మొచ్చిన మా పిలక మాష్టారు ఓ రోజు నా వెనకాలే వచ్చి నేనాడుతున్న రైలాట చూసి 'వెధవాయ్ సిగరెట్టంత లేవు సిగరెట్టు కాలుస్తావా' అంటూ చెవి పిండేశారు. అదే ఈ కాలం మాష్టార్లయితే 'ఒన్ సిగరెట్ ప్లీజ్" అని అడిగి తీసుకుని కలసి కాలుస్తారు.

"అలా మొదలయిన స్మోకింగ్ కాలేజీ కొచ్చేసరికి చెయిన్ స్మోకింగ్‌గా మారింది. కాలేజీ లైఫు గుర్తొస్తే ముందుగా గుర్తొచ్చేది సీత. అంటే ఇప్పుడు సీతమ్మగా మారుంటుంది. ఆమెను నేను గాఢంగా ప్రేమించాను. పెళ్లి చేసుకునుంటే ఆమే నీకు నాన్నమ్మ అయుండేది ఈమెకు బదులు' అని పక్కనున్న మా నాన్నమ్మను వుద్దేశించి అన్నప్పుడు నాన్నమ్మ ఎంతో ఉడుక్కునేది.

'మరి ఆమెనే ఆ సీతమ్మగారినే చేసుకోక పోయారా. నేను ఎంచగ్గా కోనసీమ కొబ్బరి చెట్టులాంటి మా కోటి బావను చేసుకునుండేదాన్ని" అంటూ తిరిగి తాతగారికి రిటార్టు ఇచ్చేది. "చాల్లే బడాయి. మీరు తెల్లప్యాంటు మీద తెల్ల చొక్కా వేసుకుని సాయంత్రం మేడమీద ఒక్కళ్లే కూర్చుని ఆకాశం కేసి చూస్తూ సిగరెట్టు కాలుస్తున్నప్పుడు మిమ్మల్ని చూస్తుంటే నా మనసు మీరు కాల్చే 'సిగరెట్టులా కాలిపోతుంటుంది' అంటూ ప్రేమలేఖలు రాసి మీ చిన్న తమ్ముడి చేత పంపిస్తూ నన్ను పెళ్లాడేదాకా వూపిరి పీల్చలేదన్న విషయం మేమేమీ మర్చిపోలేదు తమరు మర్చి పోయినా" అంటూ నాన్నమ్మ రిటార్టును తిప్పికొట్టేవారు తాతగారు వెంటనే. మరి తాతగారితో మాట్లాడటమంటే మాటలా !

ఎంతైనా సీత సీతేరా! ఆ సీతమ్మను ఏ తాతగాడు పెళ్లి చేసుకున్నాడో గానీ వాడంత అదృష్టవంతుడు ఇంకోడుండడు. ఆమెను అలా చూస్తుంటే చాలు ఆ చూపే గట్టిగా తీసుకున్న సిగరెట్ పఫ్ అంత గాఢంగా చెప్పలేనంత ఆనందంగా వుండేది. ఆమెకు చివరిసారిగా రాసిన లవ్ లెటర్లో ఏం రాశానో తెలుసా 'ఓ సీతా! నువ్వూ నా సిగరెట్టూ రెండూ ఒక్కటే. సిగరెట్టు నా ఊపిరితిత్తులు పాడు చేస్తే నువ్వు నా హృదయాన్నే పాడు చేశావ్ అని!

ఇలా తాతగారు తన స్మోకింగ్ కత చెప్తుంటే భలే సరదాగా వుండేది వింటానికి. ఓసారి తాతగారు ఎయిర్ ఫోర్స్‌లో పనిచేస్తున్నప్పుడు ప్యారిస్ అఫీషియల్ ట్రిప్ మీద వెళ్లాల్సొచ్చింది. అక్కడ జరిగిన ఓ సంఘటన చెప్తుంటే భలే నవ్వాము నేనూ, నాన్నమ్మా.

"అప్పుడు ఓ నెల దాకా ప్యారిస్‌లో వుండాల్సొస్తుందన్నారు. నాకేమో విల్స్ తప్ప మరొక బ్రాండ్ సిగరెట్ తాగే అలవాటు లేదు. తాగితే ఆ బ్రాండే తాగాలి. ఆ బ్రాండేమో అక్కడ ప్యారిస్‌లో దొరకదు. అందుకే నెలకు సరిపడా కొన్ని కార్టన్స్ ఆఫ్ సిగరెట్ ప్యాకెట్స్ ప్యాక్ చేయించి ప్లేన్‌లో తీసుకెళ్లాను.

"తీరా అక్కడ ప్యారిస్ ఎయిర్ పోర్ట్‌లో కస్టమ్స్ వాళ్లు పట్టుకుని "ఇన్ని కార్టన్సాఫ్ సిగరెట్స్! ఇక్కడేమైనా షాప్ పెట్టబోతున్నారా? షాపు తెరవడానికి లైసెన్సు ఉందా?' అంటూ ఆ కార్టన్స్ అన్నీ హ్యాండోవర్ చేసుకున్నారు. వాళ్లను ఎంతో రిక్వెస్టు చేశాను. వినలేదు. ఏం చెయ్యాలో అర్థంగాక పజిలయిపోయి టెన్షన్ ఫీలవుతున్న సమయంలో నన్ను రిసీవ్ చేసుకోవడానికి ఆలస్యంగా వచ్చిన అక్కడి గవర్నమెంట్ హైయర్ ఆర్క్ ఆఫ్ కస్టమ్స్ ఆఫీసర్స్‌కు నన్ను వి.ఐ.పి. ఆఫ్ ఇండియాగా పరిచయం చేసి నా సిగరెట్ ప్యాకెట్సును నాకిప్పించేశారు. అప్పుడు వాళ్లు 'హీ ఈజ్ నాటోన్లీ వీఐపీ ఆఫ్ ఇండియా బటాల్సో చెయిన్ స్మోకర్ ఆఫ్ ఇండియా' అంటూ నా గూర్చి చిన్నగా కామెంట్ చేయడం నాకు వినిపించి నవ్వుకున్నాను.'

ఓసారి తాతగార్ని అడిగాను "మిమ్మల్ని ఈ సిగరెట్టు మాన్పించే ప్రయత్నం ఎవ్వరూ చెయ్యలేదా? చివరకు నాన్నమ్మతో సహా."

అప్పుడు చెప్పారు తాతగారు "మీ నాన్నమ్మకు నేను అంతగా నచ్చడానికి కారణం నేను సిగరెట్టు తాగే స్టైలే కదా. ఇక మాన్పించే ప్రయత్నం ఆమెందుకు చేస్తుంది. కాకపోతే ఈ మధ్యే మానమంటూ గొడవ మొదలెట్టింది. అంటే దీన్ని బట్టి నీకేమర్థమయిందంటావ్" అనడిగారు. వెంటనే నేను చెప్పాను. "మొదట్లో నీ మీద నాన్నమ్మకు లేని ప్రేమ ఈ మధ్యే పుట్టోంది"అని అప్పుడు తాతయ్య ఫక్కున పెద్దగా నవ్వడం నాన్నమ్మేమో "ఓరి భడవా!" అంటూ నా చెవి పిండడం ఒక్కసారే జరిగింది. మరలా తాతగారు అంటున్నారు. "కానీ మా నాన్న అంటే నీకు ముత్తాతవుతాడు అప్పుడప్పుడూ బాగానే క్లాసు.... క్లాసేం ఖర్మ స్కూలే తీసుకుంటుండేవాడు మానెయ్యమంటూ. ఓసారి నిలదీశాడు మానేయ్ సిగరెట్టు - లేకపోతే నా మీద

## తొలి చిత్ర ప్రదర్శన

**1896** జూలై ఏడవ తేదీన బొంబాయి వాట్సన్ హోటల్‌లో తొలిసారిగా భారతదేశంలో చలనచిత్రాన్ని ప్రదర్శించారు. అప్పటికి థియేటర్స్ లేకపోవటంతో హోటల్‌లో ఒక తెరను ఏర్పాటుచేసి సినిమాటోగ్రఫీ అనే మిషన్ ఫ్రాన్స్ నుంచి తీసుకువచ్చి, లూమినార్, లూయిస్, ఆగస్టి అనే ముగ్గురు సోదరులు చలనచిత్ర ప్రదర్శన చేశారు. రోజూ నలభై నిముషాలు ఒకే చిత్రాన్ని ప్రదర్శించేవారు. టికెట్టు ఖరీదు ఒక రూపాయి. అప్పట్లో ఆ రూపాయి చాలా ఎక్కువ మొత్తం కావడంతో లగ్జరీ అనే వారట ప్రజలు!

*సేకరణ: కలపర్తి సత్యం (ఏలూరు)*


ఒట్టు అని. వెంటనే నేను చెప్పాను తీసేయ్ ఒట్టు - అదిగో గట్టు అని. ఎందుకు మానెయ్యలేవని అడిగాడు. తాగకపోతే నేను సిగరెట్టులా కాలిపోతానన్నాను. 'ఆ మాత్రం విల్ పవర్ లేని పూర్ ఫెలోవా నువ్వు' అన్నారు. 'విల్స్' పవర్ ఈజ్ మోర్ దాన్ విల్ పవర్ డాడీ' అని ఘాటుగా జవాబు చెప్పేసరికి ఇంకెప్పుడూ నా జోలికి రాలేదు."

ఈ సిగరెట్ స్మోకింగ్ మీద ఎన్నో జోకులు చెప్తుండే వారు తాతగారు. అందులో నాకు బాగా నవ్వు తెప్పించినవి తాతగారి మాటల్లోనే - "సిగరెట్టు తనెటూ మానలేక పోతున్నాడని ఓ సైకియాట్రిస్టు దగ్గరకెళ్ళి మొర పెట్టుకున్నాడట ఓ స్మోకర్ మూర్తి. అతన్ని సైకియాట్రిస్టు ఫీజు వెయ్యి రూపాయలు కట్టమని అడిగేసరికి మారు మాట్లాడకుండా వెనక్కి పరుగెత్తి కెళ్ళి ఆ రోజు నుంచి స్మోకింగ్ పూర్తిగా మానేసి భార్యతో చెప్పాడట నేను వెయ్యి రూపాయలు ఆదా చేశానని. కానీ అతనికి తెలియని విషయం ఆ సైకియాట్రిస్టు దగ్గరకు బలవంతాన పంపిన తన భార్య ఆ సైకియాట్రిస్టుకు అసలు ఫీజు ముందే కట్టిందని. అలాగే ఓ భార్య భర్తను గొడవ చేసిందట మీరు గనుక సిగరెట్టు మానెయ్యకపోతే నేను మీకు విడాకులిచ్చేస్తానూ అని. అప్పుడా భర్త వెంటనే ఎగ్గిరి గంతేసి అయితే నేను మానను సరిగదా రోజుటి మీద ఎక్కువ కాలుస్తాను అన్నాడట. ఇలాంటిదే మరో భార్య భర్తతో మారాం చేస్తూ మీరు మీ గురించి కాదు ముందు నా గురించి సిగరెట్టు మానెయ్యండి. పొగతాగే వాళ్ళ కన్నా పీల్చేవాళ్ళకే ఎక్కువ హానికరం అంటూ భర్తైమైపోతే నాకేమి, నేను మాత్రం విడోగానైనా బతికుండా లన్న అర్థం వచ్చేట్లు తెగ ఫీలయిపోయిందట!

"ఇలాంటివే ఎన్నో జోకులు చెప్పుకోవచ్చు. అలాగే కాప్షన్స్ మీద చెప్పాలంటే ఓ సిగరెట్టు తాలూకు ప్రకటన ఇలాటిది. 'సిగరెట్ తాగడం వలన క్యాన్సర్, టీబీ లాంటివి రావచ్చు. మీరు చనిపోవచ్చు. కానీ ఓ విషయం గుర్తుంచుకోండి ఎప్పటికైనా చనిపోవాల్సిన వాళ్లమే. ఈ జీవితం మిధ్య అన్న విషయం మర్చిపోవద్దు.' మంచి కాప్షన్స్‌గూర్చి చెప్పాలంటే 'అవర్ లంగ్స్ ఆర్ వర్కింగ్ - డోంట్ స్మోక్'.

"ముందు నా స్మోకింగ్ మీద నేను జోకేసుకుంటాను. మరేంలేదు వచ్చే జన్మలో మీనాన్నమ్మ ఏమై పుట్టినా నేను మాత్రం దున్నపోతుగా పుట్టను. ఎందుకంటే గురజాడవారు పొగతాగని వాళ్ళను శపించారు గదా పొగతాగని వాడు దున్నపోతై పుట్టున్ అంటూ! ఈ లెక్కలో నేను దున్నపోతుగా పుట్టననే గదా అర్థం" అంటూ పెద్దగా నవ్వారు. ఆ నవ్వులో నేనూ నాన్నమ్మా శ్రుతి కలపకుండా వుండలేకపోయాం.

"అంతేగాదు సిగరెట్టు తాగేవాళ్ళు మరో సమస్య ఫేస్ చేయాల్సిస్తుంటుంది. ఆఫీసుల్లో అయితే చేతిలో ప్యాకెట్ చూస్తే చాలు అటెండర్ దగ్గర్నుంచి ఆఫీసర్




వరకూ 'ఒన్ సిగరెట్ ప్లీజ్' అంటూ అడుగుతుంటారు. కొంతమందైతే ఇలా 'వూరికే వచ్చే సిగరెట్' అనే బ్రాండ్‌నే కాలుస్తారు వాళ్ళను 'ఫ్రీ ఫినాయిల్ స్మోకర్స్' అనొచ్చు. సో సో అయ్యే ఈ డబుల్ బాల్ బేరింగ్ ఖర్చు తప్పించుకోవడానికి సిగరెట్ ప్యాకెట్ రహస్య ప్రదేశాల్లో దాచుకోవాల్సొస్తుంది. ఇక కొంత మందున్నారు వాళ్ళు బయట గొప్ప కోసమేమో సిగరెట్ తాగుతారు ఇంట్లో నేమో పదిపైసల బీడీలు కాలుస్తారు. వీళ్ళను 'హోం బీడీ స్మోకర్స్' అనొచ్చు. ఇంకో కేటగిరీ స్మోకర్స్ వున్నారు. కాస్ట్‌లీ ప్యాకెట్ అర్ధ రూపాయి చీప్ సిగరెట్లు నింపుకుని అందరి ముందూ ఫోజు గొడ్తుంటారు. వీళ్ళను 'పైపలలో స్మోకర్స్' అనొచ్చు. అంటే పైన పటారం లోన లొటారం స్మోకర్స్ అర్థం. ఇలా స్మోకర్స్‌లో ఎందరో మహా స్మోకర్స్! అందరికీ సిగరెట్టాభివందనాలు!"

తాతగారి ఆలోచనలు వారి జ్ఞాపకాలు హృదయాన్ని కదిలించేసరికి అక్కడ్నుంచి కన్నీళ్ళు అసంకల్పితంగా పైకి ఉప్పొంగి కళ్ళలోంచి బయటకు నా చెంపల మీద జాలువారాయి. తాతగారి జ్ఞాపకార్థం తాగకపోయినా కనీసం ఓ సిగరెట్టునైనా ఎప్పుడూ నా జేబులో ఉంచుకో వాలనిపిస్తోంది. బహుశా ఇందులో అతిశయోక్తి అతిగానే ఉండొచ్చు. కానీ మా తాతగారి మీద నాకున్న ప్రేమాభిమా నాలకు ఇంతకన్నా వేరే భాష్యం నేనిచ్చుకోలేను.

ఇంతలో పక్కనే వచ్చి నిలుచున్నారు నాన్న! ఎప్పుడొచ్చారో తెలీదు. వచ్చి నా కన్నీళ్ళు తుడిచి నా తల మీద తన అమృత హస్తంతో లాలనగా స్పృశించారు.

"నాన్నా!" పిలిచాను చిన్నగా. తాతగారు చనిపోతూ చివరిగా నాన్నను దగ్గరకు తీసుకుని చెవిలో ఏం చెప్పారు? అదే క్యూరియాసిటీ నాలో. తెలుసుకోవాలన్న తపన... తాపత్రయం. "నాన్నా! తాతగారు చనిపోతూ మీ చెవిలో చెప్పిన చివరి మాటలు ఏమిటో చెప్పరూ!?"

ఎందుకో తెలీదు నా ప్రశ్నవిన్న వెంటనే నాన్నగారి కళ్ళలో కన్నీళ్ళు జీవధార కట్టాయి. కొన్ని క్షణాల మౌనం తర్వాత చెప్పారు వణుకుతున్న స్వరంతో "నాకో మాటివ్వాలంటూ తన చేతిలో చెయ్యి వేయించుకుని ఇంకెప్పుడూ నువ్వు సిగరెట్టు తాగడానికి వీల్లేదు. ఈ రోజు నుంచి నువ్వు పూర్తిగా స్మోకింగ్ మానేయాల్సిందే. నాలా నువ్వు లంగ్ కేన్సర్‌కు బలికాకూడదు ఇదే నా చివరి కోరిక అంటూ... స్మోకింగుకు... బ.. లై... పో... యా... రా మీ తాతగారు!" అంటూ భోరుమన్నారు నాన్న.

నాన్నగార్ని ఓదార్చే ప్రయత్నం చేశాను. బహుశా తాతగారి చివరి కోరిక నెరవేర్చే బాధ్యత నా మీద కూడా వుంది కాబోలు!

●

## కోతి నడిపిన రైలు

గుజరాత్‌లోని రాజ్‌కోట్ రైల్వే స్టేషన్ యార్డులో ఓ డ్రైవరు ఇంజనును నిలిపి తను ప్రక్కనే ఉన్న టీ స్టాల్‌కు టీ తాగడానికి వెళ్ళాడు.

ఈలోపున పక్కనే చెట్టు మీద ఉన్న ఓ కోతి చటుక్కున ఇంజనులోకి దిగి అందులో ఉన్న సాధనాలన్నిటితో ఆటలు మొదలెట్టింది. కోతి చేష్టలకు ఇంజను కదిలి డ్రైవరు లేకుండానే రంయిమని వెళ్ళిపోవడం మొదలు పెట్టింది. 60 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేసి రైల్వే ట్రాక్ అయిపోగా ఓ బండకు ఢీకొని ఆగిపోయింది.

**సేకరణ: ముద్దా రమణమూర్తి**
(అనంతపురం)